
సాక్షి
ప్రకాశం
సోమవారం | 24 | జూలై | 2023



చేసింది శూన్యం
టీడీపీ హయాంలో గ్రానైట్ పరిశ్రమకు ఏం చేశారో నారా లోకేష్ సమాధానం చెప్పాలని గ్రానైట్ వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు.
- 8లో..



దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి
దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామి రెడ్డి అన్నారు.
- 8లో..

గరిష్టం/కనిష్టం
31/27

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు బాలినేని ఒంగోలు రాక


ఒంగోలు అర్బన్: మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి విదేశీ పర్యటన ముగించుకుని సోమవారం సింహపురి ఎక్స్‌ప్రెస్ రైలులో ఒంగోలు వస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. ఒంగోలు చేరుకున్న బాలినేని పార్టీ నేతలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారన్నారు.

అండర్ 16 జిల్లా బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

అండర్ 16 జిల్లా బాలుర క్రికెట్ జట్టు

ఒంగోలు: అండర్- 16 బాలుర జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక ఆదివారం స్థానిక ఏసీఏ మినీ లార్డ్స్ గ్రౌండ్‌లో జరిగింది. ఈ ఎంపిక ప్రక్రియను ప్రకాశం జిల్లా క్రికెట్ అడ్‌హక్ కమిటీ కన్వీనర్ ఎం.వీరరాఘవరెడ్డి పరిశీలించారు. మొత్తం 60 మంది హాజరుకాగా వారిలో బౌలింగ్, ఫీల్డింగ్, బ్యాటింగ్, కీపింగ్ వంటి వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారితో ప్రాబబుల్స్ జట్టు ఎంపిక చేశారు. ఈ ప్రాబబుల్స్‌కు మ్యాచ్‌లు నిర్వహించి వారిలో మెరుగైన ప్రతిభ కనబరిచిన వారిని తుది జట్టుకు ఎంపిక చేయనున్నట్లు కన్వీనర్ ఎం.వీరరాఘవ రెడ్డి తెలిపారు. ఈ ఎంపిక కార్యక్రమంలో కోచ్ చంద్ర, బాబూరావు, కేశవరెడ్డి పాల్గొన్నారు.


ఆడుదాం ఆంధ్ర విధివిధానాల ఖరారుకు 26న సమావేశం
ఒంగోలు టౌన్: ఆడుదాం ఆంధ్ర పోటీల విధివిధానాలను రూపొందించేందుకు ఈ నెల 26వ తేదీ సమావేశం నిర్వహించనున్నట్లు డీఈవో సుబ్బారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఒంగోలులోని రిమ్స్ హాస్పిటల్ ఆడిటోరియంలో నిర్వహించే ఈ సమావేశానికి జిల్లాలోని ఎంఈవోలు, వ్యాయామ ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. ప్రతి గ్రామ వార్డు, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో క్రికెట్ పోటీలను నిర్వహించేందుకు అనువైన రెండు ప్రదేశాలను ఎంపిక చేసి వాటి వివరాలను సమావేశంలో సమర్పించాలని తెలిపారు.

ఇంటికొచ్చి.. నాడిపట్టి


గుండ్లాపల్లిలో మహాలక్ష్మమ్మ ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న డాక్టర్ మానస

ఈమె పేరు వల్లెపు మహాలక్ష్మమ్మ. వయసు 86 సంవత్సరాలు. మద్దిపాడు మండలంలోని గుండ్లాపల్లిలో నివసిస్తోంది. కీళ్లు, మోకాళ్ల నొప్పులతో నడవలేని స్థితిలో మంచంలోనే ఉంటోంది. ఆస్పత్రికి వెళ్లలేక ఇంటి దగ్గరే ఎవరో ఒకరిచేత మందులు తెప్పించుకుంటూ కాలం వెళ్లదీస్తోంది. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా మద్దిపాడు పీహెచ్‌సీ డాక్టర్ మానస నెలకు రెండుసార్లు మహాలక్ష్మమ్మ ఇంటికి వెళ్లి పరీక్షించి అవసరమైన మందులు ఇస్తున్నారు. "అంతకు ముందు మద్దిపాడు ఆస్పత్రికి పోవాల్సి వచ్చేది.. ఇప్పుడు ఆ ఇబ్బంది తప్పింది.. మా లాంటి ముసలాళ్ల ఆరోగ్యాన్ని చూసేందుకు ముఖ్యమంత్రి డాక్టర్లనే ఇళ్లకు పంపటం ఎంతో ఉపయోగంగా ఉంది'' అని మహాలక్ష్మమ్మ సంతోషంగా చెబుతోంది.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మారుమూల ప్రాంతాల ప్రజలకూ వైద్యసేవలు అందించేందుకు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ ఫిజీషియన్ వంటి వాటితో పల్లె ప్రజల ఇంటి ముంగిటనే ఆపన్నులకు వైద్యసేవలు అందుతున్నాయి. నెలకు రెండుసార్లు వైద్యులే తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి మరీ వైద్యం చేసి అవసరమైన మందులు ఉచితంగా అందజేస్తున్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా దూరంగా ఉండే పట్టణాలకు వెళ్లి వైద్యం చేయించుకునే అవస్థలు తప్పాయంటూ పల్లెజనం హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.



- ఫ్యామిలీ ఫిజీషియన్‌తో మారుమూల గ్రామాల్లోనూ ఇంటి వద్దే వైద్యసేవలు
- పీహెచ్‌సీల పరిధిలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు
- 12 రకాల వైద్య సేవలు, 14 రకాల వైద్య పరీక్షలు, 105 రకాల మందులు
- జిల్లాలో హెల్త్ క్లినిక్‌లు 492
- హెల్త్ క్లినిక్‌ల పర్యవేక్షణ బాధ్యత పీహెచ్‌సీల డాక్టర్లది
- జిల్లా స్థాయిలో నోడల్ అధికారి పర్యవేక్షణ

ఒంగోలు అర్బన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ, 108 వంటి పథకాలతో ప్రజలకు అత్యవసర, ఖరీదైన వైద్య సేవలు ఉచితంగా అందుబాటులోకి తీసుకొస్తే.. ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరో నాలుగు అడుగులు ముందుకేసి ప్రజారోగ్యానికి పెద్ద పీట వేశారు. పలు పథకాలు, వినూత్న కార్యక్రమాల ద్వారా వైద్య సేవలను మరింత విస్తృత పరిచి ప్రజల చెంతకు చేరుస్తున్నారు. దానిలో భాగంగా గ్రామ స్థాయిలో వైద్య సేవలు అందుబాటులో ఉండాలని వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి క్షేత్ర స్థాయిలో వైద్య సేవలు, వైద్య పరీక్షలు, ఔషధాలు అందజేస్తున్నారు. మండల స్థాయిలో ఉండే పీహెచ్‌సీల పరిధిలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. వీటిలో ఒక సీహెచ్‌ఓ (కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్) లేదా ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్), ఒక ఏఎన్ఎం, ఒక ఆశా వర్కర్ ప్రజలు వైద్య సేవలు అందిస్తారు. ఈ క్లినిక్‌లకు నెలలో రెండు సార్లు పీహెచ్‌సీ వైద్యులు సాధారణంగా వైద్య సేవలు అందిస్తారు. అవసరాన్ని బట్టి ఎక్కువసార్లు కూడా క్లినిక్‌లకు వచ్చి వైద్య సేవలు అందిస్తారు. అంతేకాకుండా వైద్య సేవలు పొందుతున్న రోగులకు టెలి కన్సల్టేషన్ ద్వారా కూడా సూచనలు, సలహాలు నిరంతరం అందిస్తారు.


కనిగిరి మండలం నందనవనం గ్రామంలో వృద్ధురాలికి ఇంటి వద్ద వైద్యం చేస్తున్న డాక్టర్ హనుసందీప్

2020 నుంచి విలేజ్ హెల్త్ క్లినిక్‌లో వచ్చిన ఓపీలు : 43,32,565

12 రకాల వైద్యసేవలివీ..
విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో 12 రకాల వైద్యసేవలు అందిస్తున్నారు. వాటిలో ముఖ్యంగా గర్భిణులకు, 5 సంవత్సరాల లోపు పిల్లలకు వ్యాక్సినేషన్, నియోనేటల్ వైద్య సేవలు, ఫ్యామిలీ ప్లానింగ్, దీర్ఘకాలిక వ్యాధులు, ఈఎన్‌టీ తదితరాలు ఉన్నాయి.

వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఇవీ
14 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. హిమోగ్లోబిన్, హెచ్‌సీజీ, బ్లడ్ షుగర్, బీపీ, మలేరియా, డెంగీ, అయోడిన్, ర్యాపిడ్ టెస్టులు, యూరిన్ ప్రెగ్నేన్సీ, హెచ్ఐవీ తదితర పరీక్షలు చేస్తున్నారు. వీటితో పాటు హెల్త్ క్లినిక్‌ల్లో 105 రకాల ఔషధాలను అందుబాటులో ఉంచారు. ప్రతి విలేజ్ హెల్త్ క్లినిక్‌లో కనీసం 20 ఓపీలు చూడాలనే లక్ష్యం నిర్దేశించారు. ఆ మేరకు ఆశా, ఏఎన్ఎంలు ఆయా సచివాలయాల పరిధిలో నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు హెల్త్ క్లినిక్‌ల్లో వైద్య సేవలు అందించడం, అవసరమైతే ఇంటికే వెళ్లి సేవలందిస్తున్నారు. ఈ హెల్త్ క్లినిక్‌లపై పీహెచ్‌సీ డాక్టర్ల ప్రాథమిక పర్యవేక్షణ ఉంటుంది. వారంలో ఒకసారి క్లినిక్‌లకు వెళ్లి ఓపీలు, పరీక్షలు ఇతర రికార్డులు, పోర్టల్స్‌ను పరిశీలిస్తారు. రెండో దశలో డివిజన్ స్థాయిలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు పర్యవేక్షణ జిల్లా స్థాయిలో నోడల్ అధికారి పర్యవేక్షణ ఉంటుంది. ఈ ప్రక్రియతో హెల్త్ క్లినిక్‌ల్లో వైద్య సేవలు ఎటువంటి అంతరాయం లేకుండా ప్రజలకు అందించేందుకు వీలవుతోంది. జిల్లాలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు 492 మంజూరు కాగా వాటిలో 221 క్లినిక్‌ల నిర్మాణాలు పూర్తి చేసి వైద్య సేవలు అందిస్తున్నారు. జిల్లాలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసిన 2020 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు 43,32,565 ఓపీలు నమోదయ్యాయి. రోజుకు సుమారుగా 20 నుంచి 35 ఓపీలు విలేజ్ హెల్త్ క్లినిక్‌లో చూడటంతో పాటు 7 నుంచి 11 వరకు టెలీ కన్సల్టేషన్ ద్వారా కూడా సేవలు అందిస్తున్నారు.


గుండమాలలో ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంప్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ హేమంత్ కుమార్

క్షేత్రస్థాయిలో మెరుగైన వైద్యసేవలు

విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా క్షేత్ర స్థాయిలో అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు అత్యవసర ప్రాథమిక చికిత్స అందించడంతో ప్రాణాలు కాపాడగలిగేందుకు వీలవుతోంది. అంతేకాకుండా గ్రామ స్థాయిలో వైద్య సేవలు ప్రజలకు అందుబాటులో ఉంటున్నాయి. వీటిలో పదుల సంఖ్యలో వైద్య సేవలు, వైద్య పరీక్షలు, వందకు పైగా ఔషధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో ప్రభుత్వ ఆశయాల మేరకు వైద్య ఆరోగ్య శాఖలో పక్కా చర్యలు చేపట్టాం. ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నాం.
- కలెక్టర్ దినేష్‌కుమార్

ఇంటికి దగ్గరలోనే వైద్యం అందుతోంది

హెల్త్ క్లినిక్ ఏర్పాటుతో ఇంటికి దగ్గరలోనే వైద్యం అందుతోంది. గతంలో జ్వరం, దగ్గు, ఇతర చిన్నా చితకా రోగాలకు ప్రైవేటు హాస్పిటల్‌కు పోయేదాన్ని. డబ్బులు ఖర్చయ్యేవి. ఒక్క రూపాయి ఖర్చులేకుండా ఇప్పుడు జగనన్న పెట్టిన క్లినిక్‌ల్లో ఉచితంగా పరీక్షలు చేసి డాక్టర్‌సార్ మందులు ఇస్తున్నారు. మా అబ్బాయి వెంకట్రావు చాలా ఏళ్ల నుంచి మానసిక, కీళ్ల సంబంధిత రోగంతో బాధపడుతున్నాడు. ఇప్పుడు డాక్టర్ నెలకు రెండుసార్లు ఇంటికి వచ్చిచూసి మందులు ఇస్తున్నారు.
- పద్మావతమ్మ, పామూరు

వైద్యానికి దూర ప్రాంతాలకు వెళ్లే బాధ తప్పింది

నేను ఒక మారుమూల మత్స్యకార పల్లెప్రాంతంలో జీవిస్తున్నాను. గతంలో డాక్టర్‌కు చూపించుకోవాలంటే ఒంగోలు పోవాల్సి వచ్చేది. ఇప్పుడు సీఎం జగన్ మా ఊళ్లోనే హెల్త్ క్లినిక్ సెంటర్ పెట్టారు. అవసరమైన వాళ్లకు నెలలో రెండు సార్లు డాక్టర్లు ఇంటికి వచ్చి వైద్యం చేస్తున్నారు. బీపీ, ఇతర పరీక్షలు చేసి ఉచితంగా మందులిస్తున్నారు. సీఎంకు రుణపడి ఉంటాం.
- కె.సీతమ్మ ,గుండమాల, కొత్తపట్నం మండలం

ఇతనిపేరు నల్లపరెడ్డి వెంకారెడ్డి (71). కొత్తపట్నం మండలం మడనూరు గ్రామం. బీపీ, షుగరు, నరాల బలహీనతతో మంచంలోనే ఉంటున్నాడు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్ ద్వారా ఇతనికి ఉచితంగా వైద్యసేవలు అందుతున్నాయి. నెలలో రెండుసార్లు ఈతముక్కల పీహెచ్‌సీ డాక్టర్ శివపార్వతి ఇంటికొచ్చి చూస్తున్నారు. ఉచితంగా మందులు కూడా ఇస్తున్నారు. దీంతో క్రమంగా కోలుకుంటున్నాడు. ఇంతకు ముందు ఎప్పుడూ డాక్టర్లు ఇంటికొచ్చి చూడలేదేని.. జగన్ సీఎం అయ్యాక పేదలకు వైద్యం అందుతోందని అంటున్నాడు వెంకారెడ్డి.


వెంకారెడ్డికి ఇంటి దగ్గర వైద్యం చేస్తున్న డాక్టర్ శివపార్వతి

యువగళం అట్టర్ ఫ్లాప్

- మీ బాబుకు రోజూ కలలోకి వచ్చేది మా జగనన్నే
- మార్కాపురంలో మీ నేత మేసింది రూ.1500 కోట్లు
- హిమ్ కేసులో బయటకు వచ్చేందుకు కందుల ప్రయత్నాలు
- మా కుటుంబంపై విచారణ కోసం కలెక్టర్‌ను కలవండి
- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం: నియోజకవర్గంలో యువగళం పాదయాత్ర అట్టర్ ఫ్లాప్ కావడంతో లోకేష్ ఏం మాట్లాడుతున్నాడో అర్థం కావడం లేదని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. పొదిలిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిపై లోకేష్ చేసిన ఆరోపణలపై ఆదివారం ఎమ్మెల్యే మార్కాపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లోకేష్‌తోపాటు స్థానిక టీడీపీ ఇన్‌చార్జిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికీ లోకేష్‌కు నలుగురిలో మాట్లాడటం, తెలుగులో స్పష్టంగా పలకడం చేతకాలేదని ఆ విషయం పొదిలి సభలో మరొక్కసారి వెల్లడైందన్నారు. తన యాత్ర ఫ్లాప్ కావడంతో టీడీపీ నేతల దృష్టిని మళ్లించేందుకు అర్థం పర్థంలేని ఆరోపణలు చేశారన్నారు. కేవలం ఒక సామాజికవర్గాన్ని మాత్రమే కలిసేందుకే ఆయన ప్రాధాన్యత ఇచ్చారన్నారు. నాలుగేళ్ల నుంచి ప్రతిరోజూ చంద్రబాబు కళ్లుమూసుకుంటే జగన్ కలలోనికి రావడంతో ఏం చేయాలో అర్థంకాక నిద్రకు దూరమై రాష్ట్రంలో అక్కడక్కడా తిరుగుతున్నాడని అన్నారు. లోకేష్ ఎందుకు పాదయాత్ర చేస్తున్నాడో ఇప్పటికీ అటు ప్రజలకు ఇటు టీడీపీ కార్యకర్తలకు అర్థంకాక తలలు పట్టుకుంటున్నారన్నారు.

పప్పూ...వాస్తవాలు తెలుసుకో
2019 అసెంబ్లీ ఎన్నికల్లో 151 సీట్లు సాధించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి నీకు లేదనీ లోకేష్‌ను ఉద్దేశించి ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. 2014లో మీరు ప్రకటించిన మానిఫెస్టో, 2019లో మా జగనన్న ప్రకటించిన మానిఫెస్టోలో ఎన్ని అమలు చేశారో పొదిలి, చీమకుర్తి మధ్యలో ఉన్న తల్లమల్ల బ్రిడ్జిపై చర్చిద్దామని ఎమ్మెల్యే సవాల్ విసిరారు.క్యారెక్టర్ గురించి మాట్లాడే స్థాయి మీకెక్కడిదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మార్కాపురం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
ఇప్పటి వరకూ మార్కాపురం నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.1300 కోట్లు కేటాయించారని, మెడికల్ కాలేజీ, వాటర్ గ్రిడ్, రోడ్లు, పొదిలిలో పెద్ద చెరువు పనులు, మార్కాపురంలో రూ.22 కోట్లతో పైపులైన్ల ఏర్పాటు, ఆర్‌బీకేలు, సచివాలయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేవలం నీ హయాంలో టిడ్కో ఇళ్లకు శంకుస్థాపన చేసి వదిలేస్తే తమ వైఎస్సార్ ప్రభుత్వం ఇంటి నిర్మాణం పూర్తిచేస్తోందన్నారు. ఐదేళ్ల పాటు అధికారంలో ఉండీ వెలిగొండను నిర్లక్ష్యం చేస్తే వైఎస్ జగన్ పూర్తి చేస్తున్నాడని వాస్తవాలు తెలుసుకుంటే బాగుంటుందన్నారు.

మీ నేత రూ.1500 కోట్ల అవినీతి:
మీ టీడీపీ ఇన్‌చార్జి కందుల నారాయణరెడ్డి 2014 నుంచి 2019 వరకూ టీడీపీ ప్రభుత్వంలో రూ.1500 కోట్ల అవినీతికి పాల్పడిన విషయం తెలుసుకుంటే బాగుంటుంది లోకేశం అంటూ ఎద్దేవా చేశారు. ఇందులో రూ.1000 కోట్లు నీరు చెట్టు, రూ.500 కోట్లు స్వచ్ఛ టాయిలెట్ల రూపంలో ఆయన ఇంటికి చేరాయన్నారు. ఎవరో చెప్పిన మాటలు విని తమను విమర్శించడం మంచిది కాదన్నారు. మీ ఇన్‌చార్జి హిమ్ కేసు, చిట్‌ఫండ్ కేసుల్లో ఇరుక్కుని ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసా అని ప్రశ్నించారు. మార్కాపురం మండలంలో మీరు ప్రకటించిన గ్రామాల్లో ఉన్న పొలాలు తమవి కావని, అవి హెరిటేజికి సంబంధించినవో.. లేదా మీ ఇన్‌చార్జి కుటుంబ సభ్యులవో విచారణ చేసుకోవాలన్నారు. మా కుటుంబం పై వచ్చిన అవినీతి ఆరోపణలపై ఒంగోలు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి దర్యాప్తు చేయాలని అర్జీ ఇవ్వవచ్చని సూచించారు. తమ కుటుంబంలోని సభ్యులపై ఆరోపణలు రుజువైతే తానే కేసు పెట్టిస్తానన్నారు.

మచ్చలేని జీవితం:
1985 నుంచి తన తండ్రి రాజకీయాల్లో ఉన్నాడనీ, మూడు సార్లు సమితి ప్రెసిడెంట్‌గా, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన విషయం జిల్లా ప్రజలకు తెలుసని అన్నారు. తన మామ రాజకీయ కుటుంబం నుంచి వచ్చాడనీ ఆయనపై నిరాధార ఆరోపణలు తగవని అన్నారు. రూ.3 కోట్లు అప్పుచేసి పొదిలిలో హాస్పిటల్ కట్టిన విషయం అందరికీ తెలుసన్నారు. విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి షంషేర్ అలీబేగ్, పట్టణ అధ్యక్షుడు, వైస్ చైర్మన్-1,2 లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, ఏఎంసీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, పార్టీ కౌన్సిలర్లు సిరాజ్, కే కృష్ణ, దూదేకుల ప్రసాద్, బుస్సెట్టి నాగేశ్వరరావు, ముత్తారెడ్డి వెంకటరెడ్డి, ఆసిఫ్‌ఖాన్, మయూరి ఖాశీం, నాలి కొండయ్య యాదవ్, దేవండ్ల మల్లయ్య, డీవీఆర్, రమణారెడ్డి, చెన్నకేశవస్వామి దేవస్థానం చైర్మన్ కేశవరావు, తర్లుపాడు ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, సర్పంచ్ మస్తాన్, వైఎస్సార్ సీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి పి.రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి



సదస్సులో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్

ఒంగోలు టౌన్: అణగారిన గిరిజన ప్రజల సమస్యల పరిష్కారంతో పాటు, వారి హక్కుల సాధన కోసం ఈ నెల 29 నుంచి 31 వరకు మూడు రోజుల పాటు రాయచోటిలో నిర్వహించనున్న ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర నాయకుడు పీజే చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో ఆదివారం నిర్వహించిన గిరిజన సమాఖ్య సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గిరిజనులను చిన్నచూపు చూస్తోందన్నారు. మణిపూర్‌లో మారణ హోమం జరుగుతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్‌లాగా నరేంద్ర మోదీ చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. అనంతరం ముగ్గురు కన్వీనర్లతో ఏపీ గిరిజన సమాఖ్య నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. దాసరి నాగరాజు, ఆర్.శేషరత్నం, సీహెచ్.అశోక్ సహ మరో 15 మందిని ఎన్నుకున్నారు. ఈ సదస్సులో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్.నారాయణ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రకు స్పందన కరువు

- జనం లేక వెలవెలబోయిన లోకేష్ పాదయాత్ర
- కార్యకర్తల్లో జోష్ నింపలేకపోయిన యువగళం


పాదయాత్ర చేస్తున్న లోకేష్

పొదిలి రూరల్: పొదిలి మండలంలో నారా లోకేష్ రెండు రోజుల పాటు చేపట్టిన యువగళం పాదయాత్రకు ప్రజా స్పందన కరువై అట్టర్‌ఫ్లాప్ అయింది. మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందుల నారాయణరెడ్డి యువగళం పాదయాత్రకు వారం రోజుల ముందే అన్ని మండలాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి యువగళాన్ని విజయవంతం చేయాలని నాయకులకు దిశా నిర్దేశం చేశారు. అయినా టీడీపీ శ్రేణులు ఆశించిన స్థాయిలో పాదయాత్రకు ప్రజలు రాకపోవడంతో కార్యకర్తలు నిరాశ చెందారు. పాదయాత్ర ఉదయం పూట కాకుండా సాయంత్రం చేయడంతో అసంతృప్తి వ్యక్తమవుతోంది. లోకేష్ పాదయాత్ర ఆదివారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా, జనం లేకపోవడంతో చాలా ఆలస్యంగా మొదలై మండలంలోని తలమళ్ల, గోగినేనివారిపాలెం, ఉప్పలపాడు, ఏలూరు క్రాస్ రోడ్డు (మర్రిచెట్లపాలెం బిడ్జి) వద్దకు సాగింది. పాదయాత్రలో జనంలేక ఆద్యంతం నిరాశాజనకంగా, మొక్కుబడిగా సాగింది. పాదయాత్రలో ఎక్కువగా వ్యక్తిగత సిబ్బంది, పోలీసులు, డప్పుల కళాకారులే ఉన్నారు. ఉన్నా అతి కొద్ది మంది కార్యకర్తలు సెల్ఫీలు, షేక్‌హ్యాండ్‌లకే పరిమితమయ్యారు. ఎక్కడా ప్రజలతో మమేకంకావడం కానీ, మాట్లాడటంగానీ జరగలేదు. మొత్తం మీద మందుబాబుల హంగామా తప్ప పాదయాత్ర కార్యకర్తల్లో జోష్ నింపలేకపోయిందని ప్రజలు చర్చించుకోవడం గమనార్హం. ఫిర్‌దౌసినగర్ నుంచి గోగినేనివారిపాలెం వరకు ఒంగోలు-పొదిలి రోడ్డుకు ఇరువైపులా ఒక ఫ్లెక్సీగానీ, జెండాగానీ లేదంటే పాదయాత్ర ఏమాత్రం జరిగిందో అర్థం చేసుకోవచ్చు.


మర్రిచెట్లపాలెంలోని గ్రానైట్ ఫ్యాక్టరీ


రామతీర్థంలోని గ్రానైట్ క్వారీ

టీడీపీ హయాంలో.. చేసింది శూన్యం

- గ్రానైట్ పరిశ్రమకు ఏం చేశారు..?
- చంద్రబాబు, లోకేష్‌కు గ్రానైట్ వ్యాపారుల సూటి ప్రశ్న
- నేడు లోకేష్ పాదయాత్ర నేపథ్యంలో తీవ్ర స్థాయిలో చర్చ
- లోకేష్‌కు గ్రానైట్ పరిశ్రమకు రాయితీలిచ్చే దమ్ముందా అంటున్న వ్యాపారులు
- ఆర్థిక మాంద్యంలోనూ గ్రానైట్ రాయల్టీలో రాయితీలిచ్చి ఆదుకున్న వైఎస్సార్
- కన్సిడరేషన్ ఫీజులో 50 శాతం తగ్గించి, శ్లాబ్ సిస్టంతో గ్రానైట్ ఫ్యాక్టరీలకు ఊరటనిచ్చిన సీఎం వైఎస్ జగన్
- చంద్రబాబు హయాంలో చేసిందేమీ లేదంటున్న వ్యాపారులు
- కలెక్టరేట్ వద్ద ర్యాలీలు, ధర్నాలు చేసినా స్పందించలేదని గుర్తుచేసుకుంటున్న వైనం

చీమకుర్తి:

నాడు గ్రానైట్ వ్యాపారుల నడ్డి విరిచారు. నేడు మాత్రం మొసలికన్నీరు కారుస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు అణచివేసి.. నేడు అధికారం కోసం అర్రులు చాస్తూ అది చేస్తాం..ఇది చేస్తాం.. అంటూ టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, ఆయన తనయుడు లోకేష్ కొంగజపం చేస్తున్నారు. 2014–19 మధ్య చంద్రబాబు హయాంలో గ్రానైట్ పరిశ్రమపై రాయల్టీని 20 శాతం వరకు పెంచారు. గ్రానైట్ పరిశ్రమ మనుగడ కష్టంగా ఉందని క్వారీల యజమానులు, ఫ్యాక్టరీల యజమానులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదు. దీంతో చేసేది లేక 2016లో జిల్లాలోని గ్రానైట్ యజమానులు, కార్మికులంతా కలిసి ఒంగోలు మినిస్టేడియం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ధర్నా చేసి నిరసన తెలిపారు. అయినా చంద్రబాబు స్పందించలేదు. నారా లోకేష్ పాదయాత్ర నేడు చీమకుర్తి మండలంలోని గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీల మీదుగా సాగనున్న నేపథ్యంలో.. టీడీపీ హయాంలో గ్రానైట్ పరిశ్రమలకు, వ్యాపారులకు ఏం న్యాయం చేశారనే చర్చ తెరమీదకు వచ్చింది. వారు అధికారంలో ఉన్న సమయంలో ఏ విధమైన ఫేవర్ చేయకపోగా, సమస్యల పరిష్కారం కోసం ఒంగోలులో ర్యాలీలు, కలెక్టరేట్ వద్ద ధర్నాలు చేసినా స్పందించలేదని గ్రానైట్ వ్యాపారులు గుర్తుచేసుకుంటున్నారు. చంద్రబాబు గానీ, లోకేష్‌గానీ తమ గురించి పట్టించుకున్న పాపాన పోలేదని పెదవి విరుస్తున్నారు. ఇప్పుడైనా పాదయాత్రలో గ్రానైట్ పరిశ్రమకు రాయితీల హామీ ఇచ్చే దమ్ము లోకేష్‌కు ఉందా అని చర్చించుకుంటున్నారు. అదే సమయంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రానైట్ పరిశ్రమకు చేసిన మేలును గుర్తుచేసుకుంటున్నారు.

గ్రానైట్ పరిశ్రమకు అండగా నిలిచిన వైఎస్సార్...

2008లో ప్రపంచమంతా ఆర్థిక మాంద్యంతో కొట్టుమిట్టాడుతున్న సమయంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ప్రకాశం జిల్లా గెలాక్సీ గ్రానైట్ పరిశ్రమ పీకల్లోతు కష్టాల్లో మునిగింది. అలాంటి దశలో చీమకుర్తికి చెందిన గ్రానైట్ యజమానులు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి విజ్ఞప్తి


రాయల్టీ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ 2016లో ఒంగోలులో ర్యాలీ

చేయగా.. గ్రానైట్‌పై చెల్లించే రాయల్టీని రెండు దశల్లో తగ్గిస్తూ జీవో ఇచ్చారు. మొదటి సంవత్సరం 40 శాతం, రెండో సంవత్సరం 20 శాతం రాయితీ ప్రకటించి గ్రానైట్ పరిశ్రమను వైఎస్సార్ ఆదుకున్నారు. దాని వలన గ్రానైట్ క్వారీలకు, ఫ్యాక్టరీలకు ఎంతో మేలు జరిగింది.

రాజన్న బాటలోనే ఆయన తనయుడు జగనన్న...

2019–20లో రెండేళ్ల పాటు కరోనా కష్టకాలంలో గ్రానైట్ ఎగుమతులు దాదాపు 50 శాతానికిపైగా పడిపోయాయి. చైనాకు కావాల్సిన గ్రానైట్ నిల్వలు అవసరానికి మించి ఉండటంతో పాటు చైనాలో కరోనా ఉధృతంగా ఉండటంతో ప్రకాశం జిల్లా నుంచి ఎగుమతులు నిలిచిపోయాయి. ఎగుమతులు లేని కారణంగా గ్రానైట్ క్వారీలు మూతపడే పరిస్థితి ఏర్పడింది. గ్రానైట్ ఫ్యాక్టరీల్లో పాలిష్ చేసిన మెటీరియల్‌కు కూడా ఎగుమతులు లేక ఫ్యాక్టరీలలోనే గుట్టలుగా పేరుకుపోయాయి. కనీసం కరెంటు బిల్లులు కూడా కట్టలేని స్థితిలో ఫ్యాక్టరీల యజమానులు ఆందోళన చెందుతున్నారు. అలాంటి దశలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జీవో నంబర్ 58 విడుదల చేసి ఫ్యాక్టరీలకు శ్లాబ్ సిస్టం తీసుకొచ్చారు. దాని వలన గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు రాయల్టీ చెల్లించకుండా కేవలం కట్టర్ సైజు మిషన్‌లో ఒక్కో బ్లేడ్‌కు రూ.27 వేలు చెల్లిస్తే సరిపోతుంది. దానికిగానూ 22 క్యూబిక్ మీటర్ల గ్రానైట్ రాళ్లను ఫ్యాక్టరీలకు జీఓ ప్రకారం ఇస్తున్నారు. రెండు బ్లేడ్లు ఉన్న వారికి రూ.54 వేలు చెల్లిస్తే 44 క్యూబిక్ మీటర్లు ఇస్తారు. ఈ విధానం గ్రానైట్ రాళ్లు దొరకని కష్టకాలంలో గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులకు ఎంతో దోహదపడుతుందని వారంతా ఇప్పటికీ హర్షం వ్యక్తం చేస్తుంటారు. దాంతో పాటు కరెంటును కూడా యూనిట్‌కు రూ.2 మాత్రమే చెల్లించే విధంగా ప్రభుత్వం జీవో ఇచ్చింది. దానిని త్వరలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇక గ్రానైట్ క్వారీలకు చెల్లించే రాయల్టీతో పాటు కన్సిడరేషన్ ఫీజు అదనపు భారంగా మారింది. ఇది గ్రానైట్ పరిశ్రమకు భారంగా ఉండటంతో యజమానుల విజ్ఞప్తి మేరకు 50 శాతం తగ్గించారు. దాని వలన ఒక్కో గ్రానైట్ యజమానికి కోట్లలో భారం తగ్గినట్లయింది. యజమానులంతా సంతోషం వ్యక్తం చేశారు. అయితే, చైనాకు ఎగుమతులు 90 శాతానికిపైగా నిలిచిపోవడంతో గ్రానైట్ పరిశ్రమ కాస్త ఒడిదుడుకులను ఎదుర్కొంటుందే తప్ప ప్రభుత్వం ఆదుకున్న తీరులో ఎలాంటి లోపం లేదు. ప్రభుత్వం ఆదుకున్నందునే ఈ మాత్రమైనా గ్రానైట్ పరిశ్రమ నిలబడిందని క్వారీలు, ఫ్యాక్టరీల యజమానులు అంటున్నారు.

> **శ్లాబ్ సిస్టంతో ఫ్యాక్టరీలకు మేలు**
>
> 
>
> ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రానైట్ ఫ్యాక్టరీలకు శ్లాబ్ సిస్టం తీసుకురావడంతో ఒక్కో బ్లేడ్‌కు రూ.27 వేలు చెల్లిస్తే 22 క్యూబిక్ మీటర్ల రాళ్లను తీసుకునే అవకాశం కలిగింది. దాని వలన ఫ్యాక్టరీలకు రాళ్లు దొరుకుతున్నాయి. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కూడా గ్రానైట్ పరిశ్రమకు రాయల్టీలో రాయితీ ఇచ్చి ఆదుకున్నారు.
>
> – మెన్నపూస వెంకటేశ్వరరెడ్డి, శ్రీరామ్ గ్రానైట్ ఎక్స్‌పోర్ట్, మర్రిచెట్లపాలెం

పెళ్లి సంబంధం చూస్తున్నారని యువతి ఆత్మహత్య

దర్శి: పెళ్లి సంబంధాలు చూస్తున్నారని ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన దర్శి మండలంలోని కట్టుబడివారిపాలెం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సలగల శిరీష (20) దర్శిలోని ఓ మెడికల్ షాపులో పనిచేస్తోంది. పెళ్లి చేయాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు సంబంధాలు చూస్తున్నారు. ఈ విషయంపై ఇంట్లో వివాదం జరుగుతున్న నేపథ్యంలో.. ఆదివారం ఇడ్లీ తీసుకొస్తానని చెప్పి తల్లి బయటకు వెళ్లింది. ఇడ్లీ తీసుకొచ్చేసరికి చీరతో ఫ్యాన్ హుక్కుకు ఉరేసుకుని శిరీష ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కారు ఢీకొని యువకుడు మృతి


బాషు మృతదేహం

గుడ్లూరు: రోడ్డు దాటుతున్న యువకుడిని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని 16వ నంబర్ జాతీయ రహదారిపై తెట్టు వద్ద ఆదివారం సాయంత్రం జరిగింది. వివరాల్లోకి వెళితే..తెట్టు గ్రామంలోని తూర్పుపాలెంకు చెందిన షేక్ బాషు(33) అనే యువకుడు పడమర వైపు ఉన్న సుల్తాన్ సుల్తానీబీ దర్గా వద్దకు వెళ్లేందుకు ఫ్లై ఓవర్‌పై జాతీయ రహదారిని దాటుతుండగా నెల్లూరు వైపు నుంచి ఒంగోలు వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న గుడ్లూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ భాస్కరరావు తెలిపారు.

క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(సెంట్రల్): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో సౌత్ వెస్టర్న్ రైల్వే ఇంటెలిజెన్స్ డీఎస్పీ ఎమ్మెస్ రాజు ఆదివారం కలిశారు. ఉద్యోగం పొందిన తాను మొదటగా మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశానని చెప్పారు.

బిట్‌కాయిన్స్ వలలో పడొద్దు

ఒంగోలు టౌన్: బిట్‌కాయిన్స్, క్రిప్టో కరెన్సీల్లో తక్కువ పెట్టుబడికి ఎక్కువ లాభాలు వస్తాయని ఆశ చూపి మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మలికాగర్గ్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. వ్యాపారులు, రియల్టర్లు, ఐటీ ప్రొఫెషనల్స్‌ను టార్గెట్ చేస్తూ వాట్సాప్‌లో నకిలీ లింకులు పంపిస్తున్నారని, బిట్ కాయిన్స్, క్రిప్టో కరెన్సీల పేరిట పెట్టుబడులు పెట్టించి వారి డబ్బులు కాజేస్తున్నారని తెలిపారు. నకిలీ లింకులతో వెబ్‌సైట్లు ఓపెన్ చేయించి అందులో చాలా మంది ఇన్వెస్ట్ చేసినట్లు ఫేక్ ఆన్‌లైన్ పేమెంట్ల స్క్రీన్ షాట్లను పోస్టు చేసి మాయచేస్తున్నారని, రెండుమూడు రోజుల్లోనే 10 శాతం లాభాలు వచ్చినట్లు నమ్మిస్తారని తెలిపారు. నమ్మి పెట్టుబడులు పెట్టిన డబ్బును పర్చువల్ అకౌంట్ బ్యాలెన్స్‌లో చూపిస్తున్నారని పేర్కొన్నారు. పెట్టుబడి తాలూకూ డబ్బు, లాభాలను విత్‌డ్రా చేసుకునేందుకు ఆప్షన్ ఇవ్వకుండా వలపన్నుతున్న మోసగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ఇలాంటి విషయాల్లో ఎవరైనా మోసపోతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, లేకపోతే సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి కాల్ చేయాలని ఎస్పీ తెలిపారు.

కడుపునొప్పి తాళలేక యువకుడు ఆత్మహత్య


కుమార్ (ఫైల్)

జరుగుమల్లి (టంగుటూరు): కడుపునొప్పి తాళలేక యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన జరుగుమల్లి ఎస్సీ కాలనీలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..జరుగుమల్లి గ్రామానికి చెందిన గంగోతి వెంకట కుమార్ (20) స్థానికంగా ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గత ఏడాది వివాహమైంది. ఈ క్రమంలో శనివారం రాత్రి 7 గంటల సమయంలో ఇంటికి వచ్చిన కుమార్ కడుపులో నొప్పిగా ఉందని భార్యతో చెప్పి ఇంట్లోకి వెళ్లి ఉరేసుకున్నాడు. కొద్దిసేపటి తరువాత కుమార్ తల్లి ఇంట్లోకి వెళ్లి చూడగా దూలానికి వేలాడుతూ కనిపించడంతో చుట్టుపక్కల వారు వచ్చి దించి 108 వాహనంలో ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆదివారం ఉదయం జరుగుమల్లి పోలీసులకు సమాచారం అందించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమృత హస్తం కోసం..


వైద్యశాలలో చికిత్స పొందుతున్న చిన్నారి (ఫైల్)

అమ్మా.. అని పిలవలేని పసిపిల్ల.. బాధ అంటే ఏమిటో కూడా తెలియని చిన్నారి.. ఏడ్వడం తప్ప మరోలా తన భావాలు చెప్పుకోలేని ఓ ఆడపిల్ల ఇప్పుడు నరకం చూస్తోంది. తాను చేయని తప్పుకు బలికావాలా? అని అమ్మానాన్నల వంక జాలిగా చూస్తోంది. అభం శుభం తెలియని ఆ బాలికను కబళించేందుకు తలసేమియా యముని రూపంలో ఆమె వైపు పరిగెడుతూ వస్తోంది. ఆపన్న హస్తాలు ఆదుకుంటే నిండు నూరేళ్లు బతుకుతుంది. అందరిలా బడికి వెళ్లి అ..ఆలు పలుకుతుంది. కన్నవారికి బోలెడన్ని నవ్వులు.. బంగారు మాటలు.. వజ్రాల ఆనందాలు కానుకగా ఇచ్చి తీరుతుంది. ఇక సాయం చేయాల్సింది మనసున్న వారే!

- తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారి
- ఆదుకునే వారి కోసం ఎదురుచూపులు
- దాతలు స్పందించాలని వేడుకోలు

గిద్దలూరు రూరల్: రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబం తన బిడ్డ దుస్థితి చూసి తల్లడిల్లిపోతోంది. గంజినీళ్లే పాయసంగా భావించే తల్లిదండ్రులు చిన్నారి వైద్యం కోసం లక్షలాది రూపాయలు ఎలా తేవాలో పాలుపోక దిగాలుగా కూర్చున్నారు. మండలంలోని ముండ్లపాడులో బేల్దారిగా జీవనం కొనసాగించే రాంబాబు, భార్య జ్యోతిలకు ఇద్దరు ఆడపిల్లలు సంతానం. పెద్ద కుమార్తె షాలిని కాగా, రెండో కుమార్తె అమృతకు 18 నెలల వయసు. అయితే గత ఏడాది అక్టోబర్‌లో అమృతకు ఊపిరి పీల్చడం ఇబ్బందిగా మారింది. ఆందోళనకు గురైన కన్నవారు పాపకు వెంటనే కర్నూల్‌లోని రెయిన్‌బో వైద్యశాలలో చికిత్స చేయించారు. అయితే గుండె సమస్య ఉన్నట్లు తేలడంతో మార్చి 14న తిరుపతిలో టీటీడీకి చెందిన బర్డ్ వైద్యశాలలో ఆరోగ్యశ్రీ ద్వారా గుండె ఆపరేషన్ చేయించారు. కానీ ఆపరేషన్ జరిగిన రెండు నెలల తరువాత పాపకు తరచూ జ్వరం వస్తుండగా నెల్లూరు తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. పాప రక్త నమూనాలను ముంబై పంపారు. అక్కడి నుంచి వచ్చిన రిపోర్టుల ప్రకారం ఆమెకు తలసేమియా వ్యాధి ఉన్నట్లు నిర్ధారించారు.

బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌తో సమస్యకు పరిష్కారం

అమృతను పరీక్షించిన వైద్యులు పాపకు బోన్‌మ్యారో మార్పిడి చేయాలని, అందుకు సుమారు రూ.22 లక్షలు అవసరం ఉంటుందని చెప్పారు. పూట గడవని పేదలు ఆ మాట విని కుప్పకూలారు. చిన్నారి ప్రాణాలు ఎలా కాపాడాలో అర్థంగాక విలవిల్లాడిపోతున్నారు. ఇప్పటికే అప్పోసొప్పో చేసి రూ.4 లక్షల మేర ఖర్చు చేశారు. ప్రస్తుతం వారి చేతుల్లో చిల్లిగవ్వ లేదు. ఇదిలా ఉండగా ఫిబ్రవరిలో పాప తండ్రి రాంబాబు పనిచేస్తుండగా.. ప్రమాదవశాత్తూ రాడ్ మిషన్ తగిలి ఎడమ చేతికి బలమైన గాయమవడంతో చేతికి ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం అతను కూలి పని కూడా చేయలేడు. ఆరోగ్య శ్రీ ద్వారా గుండె ఆపరేషన్ జరగడం వల్ల చిన్నారి ప్రాణాలు దక్కాయని సంతోషించిన కొద్ది రోజులకే తిరిగి భయంకరమైన వ్యాధి సోకడంతో జీవచ్ఛవాల్లా మారిపోయారు. చిన్నారిని బతికించాలనుకునేవారు 7093970430 నంబర్‌కు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా ఆర్థికసాయం చేయవచ్చు. ఎస్‌బీఐ గిద్దలూరు అకౌంట్ నంబర్ 33404725334 (చిన్నం రాంబాబు), ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ 0000788 ద్వారా కూడా సాయం చేయవచ్చు.


అనారోగ్యానికి గురైన చిన్నారితో తల్లిదండ్రులు

యాంజియోగ్రామ్ లేకుండా గుండె జబ్బుల నిర్ధారణ

- ఆస్టర్ రమేష్‌లో అత్యాధునిక సిటీ స్కాన్ సేవలు ప్రారంభం

ఒంగోలు అర్బన్: గుండె పరీక్షలకు సంబంధించి ఎంతో ముఖ్యమైన యాంజియోగ్రామ్ పరీక్ష లేకుండా గుండె జబ్బులు నిర్ధారించేలా అత్యాధునిక సిటీ స్కాన్ యంత్రం స్థానిక ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ స్కాన్ ద్వారా గుండె జబ్బులను ముందుగానే గుర్తించడంతో పాటు శరీరంలోని సున్నితమైన సమస్యలను సైతం తేలికగా గుర్తించవచ్చు. ఇటువంటి అత్యాధునిక సిటీ స్కాన్ విజయవాడ తర్వాత ఒంగోలులో ఉండటం గమనార్హం. గుండె జబ్బులకు మాత్రమే కాకుండా రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి సైతం ఈ సిటీ స్కాన్ పరీక్షలు ఎంతోగానో ఉపకరిస్తాయి. 160 స్లైసెస్ సామర్థ్యంతో పనిచేసే సిటీ స్కాన్ యంత్ర సేవలను గుంటూరు రేంజ్ ఐజీ జి. పాలరాజు, ఎస్పీ మలికాగర్గ్‌తో కలిసి ప్రారంభించారు. ప్రారంభోత్సవంలో ఆస్టర్ రమేష్ ఎండీ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు, సీఓఓ డాక్టర్ కె.హరికుమార్‌రెడ్డి, ఇతర వైద్యులు మధు, వంశీకృష్ణ, ఇంద్రనీల్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.


అత్యాధునిక సిటీ స్కాన్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఐజీ పాలరాజు, ఎస్పీ మలికాగర్గ్ తదితరులు

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి
- దొంగతనాలు, హత్య కేసుల్లో వివరాలు వెల్లడించిన డీఎస్పీ

టంగుటూరు: దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి సూచించారు. సింగరాయకొండ సర్కిల్ పోలీసుస్టేషన్లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలు చోరీ కేసుల వివరాలు వెల్లడించారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రజలు తమ వాహనాలకు సైడు లాకు తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. బంగారు ఆభరణాలు ధరించిన సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

5 సవర్ల బంగారు చైన్లు స్వాధీనం

కొత్తపట్నం మండలం ఈతముక్కల గ్రామానికి చెందిన దర్శనాల ఏడుకొండలు డిగ్రీ వరకు చదువుకొని విశాఖపట్నంలో ఓ ప్రైవేట్ బ్యాంకులో క్రెడిట్ కార్డు డిపార్టుమెంట్లో పనిచేశాడు. అనంతరం స్నేహితుల ద్వారా మద్యం, బెట్టింగులు, ఇతర చెడు వ్యసనాలకు బానిసై స్వగ్రామానికి వచ్చి ఒంగోలులోని స్నేహితుల రూంలో ఉంటూ చిన్న చిన్న దొంగతనాలు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 15న చీమకుర్తి రెడ్డినగర్ వద్ద సోడా బండి నడుపుతున్న ఒంటరి వృద్ధురాలి మెడలో ఉన్న రెండు సవర్ల బంగారు చైన్‌ను దొంగిలించాడు. అలాగే టంగుటూరు శివారులో ఉన్న లిటిల్ ఏంజెల్స్ స్కూల్ వద్ద స్కూల్ నుంచి బయటకు వస్తున్న ఒంటరి మహిళ మెడలో ఉన్న సుమారు మూడు సవర్ల బంగారు తాళిబొట్టు చైనును అపహరించాడు. ఈ క్రమంలో


స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు పరిశీలిస్తున్న డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి

ఎస్పీ, డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై ఖాదర్‌బాషా సిబ్బంది టంగుటూరు జాతీయ రహదారిపై లారీ కాటా వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా ద్విచక్రవాహనంపై పోలీసులను చూసి వాహనం వెనక్కి తిప్పి పారిపోతుండగా పట్టుకొని విచారించి ఐదు సవర్ల బంగారు చైన్లను, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ. 2,35,000 ఉంటుందని తెలిపారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు

టంగుటూరు మండలం కందులూరుకు చెందిన లాజర్ చెల్లెలను ఆశీర్వాదంకు ఇచ్చి ఏడేళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి ముగ్గురు అమ్మాయిలు ఉన్నారు. 2021లో లాజర్, ఆశీర్వాదం బేల్దారీ పనుల నిమిత్తం హైదరాబాద్ వెళ్లారు. అక్కడ ఆశీర్వాదం మేస్త్రీ వద్ద లాజర్‌కు రూ.30 వేలు ఇప్పించాడు. కొన్ని రోజుల తరువాత లాజర్ పనికి వెళ్లకుండా స్వగ్రామానికి వచ్చాడు. దీంతో మేస్త్రీ నగదు తిరిగి ఇవ్వాలని కోరాడు. దీంతో ఆశీర్వాదం లాజర్‌ను నగదు ఇవ్వాలని కోరగా..ఇద్దరి మధ్య అప్పటి నుంచి గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 19న రాత్రి ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరగ్గా..లాజర్ కత్తి తీసుకువచ్చి ఆశీర్వాదాన్ని పొడవడంతో తీవ్రంగా రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆశీర్వాదం భార్య అఖిల ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్పీ, డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై ఖాదర్‌బాషా సిబ్బంది తూర్పు నాయుడుపాలెం అడ్డరోడ్డు వద్ద నిందితున్ని అరెస్టు చేశారు.

అంతరాష్ట్ర ద్విచక్రవాహనాల దొంగ అరెస్టు

సింగరాయకొండ మండలం శానపూడి గ్రామానికి చెందిన దేవరపల్లి నాగ మురళి చెడు వ్యసనాలకు బానిసై మద్యం మత్తులో ఎక్కడైతే జన సంచారం తక్కువ ఉన్న పరిసరాల్లో, రాత్రిళ్లు హ్యాండిల్ లాక్ చేయని ద్విచక్రవాహనాలను దొంగిలించేవాడు. వాటిని స్నేహితుల ద్వారా అమ్మటం, లేదా తాకట్టు పెట్టడం కానీ చేసేవాడు. కేవలం జాతీయ రహదారి ఆనుకొని ఉన్న గ్రామాల్లోనే ఎంచుకొని దొంగతనాలకు పాల్పడేవాడు. ఇలా సింగరాయకొండ–2, ఒంగోలు తాలుకా పరిధిలో ఒకటి, ఒంగోలు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకటి, నెల్లూరు జిల్లాలో ఒకటి, తెలంగాణలో 9 ద్విచక్రవాహనాలు అపహరించాడు. కేసును సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ..క్రైం అడిషనల్ ఎస్పీ శ్రీధర్, ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి ఆధ్వర్యంలో సీఐ దాచేపల్లి రంగనాథ్, సింగరాయకొండ ఎస్సై శ్రీరామ్‌లతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. దీనిపై దర్యాప్తు ప్రారంభించి శానంపూడి అడ్డరోడ్డు వద్ద నిందితున్ని అరెస్టు చేసి అతని వద్ద సొత్తును స్వాధీనం చేసుకున్నారు. కేసులో ప్రతిభకనబరిచిన పోలీసులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలు అందించారు.